సాక్షి
కర్నూలు
సోమవారం, 1, మే, 2023



నేటి నుంచి పింఛన్ల పంపిణీ

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో సోమవారం నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. మొత్తం 2,15,669 మందికి రూ. 59,51,90,750 పంపిణీ చేసేందుకు నగదు సిద్ధం చేసుకున్నారు.



రూ. లక్ష విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న ఆలయ రాజగోపుర నిర్మాణానికి ఆదివారం కర్నూలుకు చెందిన తల్లం నరసింహప్రసాద్, కవిత దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను మేళ తాళాలతో ఆలయ ప్రదక్షిణ చేయించారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

'ఉపాధి' పనికి రూ.272 గరిష్ట వేతనం

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి పనులకు వచ్చే కూలీలకు గరిష్టంగా రూ.272 వేతనం లభించే విధంగా చూడాలని ఏపీడీ, ఏపీవోలను జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం ఉపాధి పనులకు ప్రతి రోజూ 1.10 లక్షల వరకు వస్తున్నారని, ఈ నెల నుంచి 1.57 లక్షల మంది వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6 గంటలకే పనులకు వచ్చే విధంగా చూడాలని, అవసరమైతే సాయంత్రం కూడా పనులు చేసుకొని గరిష్ఠ వేతనం పొందాలని సూచించారు.

పిడుగుల కాలం.. అప్రమత్తత అవసరం

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న రోజుల్లో అకాల వర్షాలు కురిసి పిడుగుల పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. ఉదయం నుంచి ఎండలు, వడగాలులు ప్రభావం కొనసాగి సాయంత్రానికి అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు. మే నెలలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల వరకు నమోదు కావచ్చని, ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రేపు డీఆర్‌సీ సమావేశం

కర్నూలు(సెంట్రల్): జిల్లా సమీక్ష కమిటీ(డీఆర్‌సీ) సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు నివేదికలతో హాజరై సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేసుకోవాలని ఆమె సూచించారు.

నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

- జూన్ 12వ తేదీన పునఃప్రారంభం

కర్నూలు సిటీ: అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించినట్లు డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి(సోమవారం) నుంచి వచ్చే నెల(జూన్) 11వ తేదీ వరకు స్కూళ్లకు సెలవులు ఉంటాయని, 12వ తేదీన పునఃప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. సెలవుల్లో కేవలం మన బడి నాడు-నేడు పనులు జరుగుతున్న స్కూళ్ల హెచ్‌ఎంలు, అవసరం అయితే టీచర్లు కూడా వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. సెలవుల్లో ప్రైవేటు స్కూళ్లు తరగతులు నిర్వహించినా, ట్యూషన్ పేరుతో క్లాసులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

21 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఆదివారం 21 మండలాల్లో వర్షం కురిసింది. ఆదోనిలో 38.2, సీ.బెళగల్‌లో 20.4, ఆలూరులో 18.2, పెద్దకడుబూరులో 15.2, హొళగుందలో 13.2, హాలహర్విలో 12.2, నందవరంలో 11.2, చిప్పగిరిలో 10.6, మంత్రాలయంలో 10.2, గోనెగండ్లలో 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాధారంపై వ్యవసాయం చేసేవారు పొలాల్లో పంటల వ్యర్థాలు తొలగించే పనులు ముమ్మరం చేశారు. కొందరు వేసవి దుక్కులు దున్నుతున్నారు. జిల్లాలో ఏప్రిల్ నెల సాధారణ వర్షపాతం 15.6 మి.మీ ఉండగా.. 47.6 మి.మీ. నమోదు కావడం విశేషం.



కర్నూలులోని మెరిడియన్ యూపీహెచ్‌సీ



పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఉన్న మందులు

ఆరోగ్య గోపురాలు

- జిల్లాలో 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు
- ఓపీ సేవలతో పాటు 60 రకాల వైద్యపరీక్షలు
- త్వరలో ప్రసవాలకు ఏర్పాట్లు
- టెలీమెడిసిన్ ద్వారా స్పెషాలిటీ వైద్యుల సూచనలతో వైద్యం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకే కాదు పట్టణాల్లో నివసించే వారికీ ప్రాథమిక వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఈ మేరకు ప్రతి పట్టణంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లోని పీహెచ్‌సీల్లో మాదిరిగానే ఇక్కడ కూడా అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంచారు. గత ప్రభుత్వం కంటే ఇప్పుడు రెట్టింపు ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు కావడమే గాక మరింత మెరుగ్గా వైద్యసేవలు అందిస్తున్నారు.

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి జిల్లాలో టీడీపీ హయాంలో కేవలం 25 పట్టణ ఆరోగ్య కేంద్రాలుండేవి. అవి కూడా ఎన్‌జీవోలకు ఇచ్చి నిర్వహించేవారు. దీంతో పేదలకు వైద్యసేవలు అంతగా అందేవి కావు. వైఎస్‌ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యరంగానికి ప్రాధాన్యం పెంచింది. ప్రస్తుతం కర్నూలు జిల్లాలోని కర్నూలు నగరంలో 17, ఆదోనిలో 6, ఎమ్మిగనూరులో 4, గూడూరులో ఒకటితో పాటు నంద్యాల జిల్లాలో 16 పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఒక వైద్యుడు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఒక ల్యాబ్‌టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక లాస్ట్‌గ్రేడ్ సర్వీస్ ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు ఈ కేంద్రాల్లో ఫార్మాసిస్టు ఉండేవారు కాదు. ఇప్పుడు ఫార్మసిస్టుతో పాటు ల్యాబ్‌టెక్నీషియన్లను సైతం నియమించడంతో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి. ప్రతి కేంద్రానికి రోజూ 50 నుంచి 70 మంది రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో రోజూ 2వేల మందికి పైగా, నెలకు 60వేలకు పైగా, సంవత్సరానికి 7లక్షలకు పైగా రోగులు ఈ కేంద్రాల్లో వైద్యసేవలు అందుకుంటున్నారు.

వైద్యసేవలు ఇలా...

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణంగా వచ్చే జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులు, విరేచనాలు, వాంతులతో పాటు చిన్నపిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు సైతం వైద్యసేవలను అందిస్తున్నారు. టెలీహబ్ ద్వారా వీడియోకాల్‌తో సూపర్‌స్పెషాలిటీ వైద్యులతో మాట్లాడి రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. హిమోగ్లోబిన్, ల్యూకోసైట్ కౌంట్, డిఫరెన్షియల్ ల్యూకోసైట్ కౌంట్, ప్లేట్‌లెట్ కౌంట్, ఎంపీ, ఈఎస్‌ఆర్, సీటీ, బీటీ, బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, సీరం క్రియాటినిన్, సీరం బిలిరుబిన్, ఎస్‌జీవోటి, ఎస్‌జీపీటీ, ఆల్కలైన్ ఫాస్పేట్, టోటల్ ప్రొటీన్, సీరం ఆల్బుమిన్, సీరం టోటల్ కొలెస్ట్రాల్, సీరం ట్రైగ్లిజరైడ్, సీరం విఎల్‌డీఎల్, సీరం హెచ్‌డీఎల్, సీరం అమైలేస్, ఏఎఫ్‌బి(కఫం), మలం విశ్లేషణ కోసం ఓవీపీ, సీవైఎస్‌టీ, మూత్రం ద్వారా గర్భపరీక్ష తదితర 60 రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నారు. త్వరలో థైరాయిడ్ ప్రొఫైల్‌తో పాటు కర్నూలులో 2, ఆదోని, ఎమ్మిగనూరులలో ఒక్కో కేంద్రంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్లు కూడా ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు ఇప్పటికే అన్ని కేంద్రాల్లో ఆరేసి పడకలను ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో ప్రసవాలను సైతం పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించే ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో మెడికల్, ఫార్మసీ, నర్సింగ్ కాలేజీలు, స్కూళ్ల నుంచి విద్యార్థినీ విద్యార్థులు అప్రెంటిషిప్ కోసం కూడా వచ్చి శిక్షణ పొందుతున్నారు.



రోగులకు వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంచిన పడకలు



ల్యాబొరేటరీలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చుట్టుపక్కల ప్రాంతాల వారూ వస్తున్నారు



మా యుపీహెచ్‌సీలో ప్రతిరోజూ 50 నుంచి 60 మంది రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఎక్కువగా మోకాళ్లనొప్పులు, ఒళ్లునొప్పులు, జ్వరాలు, నీరసంతో వస్తున్నారు. అవసరమైన వారికి ఇక్కడే అడ్మిట్ చేసుకుని ఐవీ ఫ్లూయిడ్స్ కూడా పెడుతున్నాం. 30 నుంచి 40 మందికి అవసరమైన వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నాం. ఈ కేంద్రానికి ఎ.క్యాంపు, బుధవారపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలైన వన్‌టౌన్, జొహరాపురంల నుంచి కూడా రోగులు చికిత్స కోసం వస్తున్నారు.

– డాక్టర్ జి.మాధవి, మెడికల్ ఆఫీసర్, యూపీహెచ్‌సీ మెరిడియన్, కర్నూలు

పూర్తిస్థాయిలో వైద్యసేవలు



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. అన్ని చోట్లా రిక్రూట్‌మెంట్ పూర్తి అయ్యింది. దీంతో వైద్యసేవలు పెరిగాయి. వైద్యసేవలపై సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ ఇచ్చి మెలకువలను నేర్పిస్తున్నాం. ల్యాబ్ పరికరాలు, పడకలు, బెడ్స్, డెలివరీ టేబుల్స్ కూడా ఏర్పాటు చేశాం. వైద్యసేవలతో పాటు ఇమ్యునైజేషన్ సేవలను కూడా నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ ఉమా, డీపీఎంవో, కర్నూలు

మంచి సౌకర్యాలు ఉన్నాయి



నేను ఇటీవలే జ్వరం వస్తే యూపీహెచ్‌సీకి చికిత్స కోసం వెళ్లాను. అక్కడ జ్వరానికి సంబంధించి అన్ని రకాల పరీక్షలు చేశారు. అంతేగాక బీపీ, షుగర్, లిపిడ్ ప్రొఫైల్, కిడ్నీ, లివర్, మల, మూత్రపరీక్షలు చాలా రకాలుగా చేస్తున్నారు. అవసరమైన మందులన్నీ ఇస్తున్నారు. ఇంత మంచి సౌకర్యాలున్న ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులో ఉండగా ప్రైవేటు ఆసుపత్రికి ఎందుకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవాలనిపించింది. ప్రజలకు అందుబాటులోనే ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రభుత్వం మంచి పని చేసింది.

– జి.గోవిందు, బుధవారపేట, కర్నూలు

నేటి నుంచి ఆర్జిత సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే

- శీఘ్ర, అతిశీఘ్రదర్శన టికెట్లు 70 శాతం కరెంట్ బుకింగ్‌లో
- ప్రొటోకాల్ దర్శనం వేళల్లో మార్పులు
- యథావిధిగా కొనసాగనున్న ఉచిత స్పర్శ దర్శనం
- శ్రీశైల దేవస్థానం ఈఓ లవన్న



ఈఓ ఎస్ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం అన్ని ఆర్జిత సేవలు, స్వామివారి స్పదర్శనం టిక్కెట్లు అన్ని సోమవారం నుంచి ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంటాయని శ్రీశైలదేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎస్ లవన్న తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానం నిర్వహించే అన్ని ఆర్జిత సేవలు, స్వామివారి స్పదర్శనం టిక్కెట్లు ఇక నుంచి కరెంట్ బుకింగ్ ద్వారా ఇచ్చే అవకాశం ఉండదని తెలిపారు. మే నెలకు సంబంధించి ఆర్జిత, స్పర్శదర్శనం టిక్కెట్లు ఏప్రిల్ 25 నుంచే భక్తులకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. దేవస్థానం వెబ్‌సైట్ www.srisailadevastanam.org ద్వారా భక్తులు ఆయా టిక్కెట్లను ముందస్తుగా పొందవచ్చునన్నారు. శీఘ్రదర్శనం రూ.150, అతిశీఘ్రదర్శనం రూ.300, టిక్కెట్లు 30 శాతం ఆన్‌లైన్‌లో, 70 శాతం కరెంట్ బుకింగ్ ద్వారా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు ప్రతి రోజు మధ్యాహ్నం భక్తులకు ఉచితంగా కల్పించే స్వామివారి స్పర్శదర్శనం యథావిధిగా కొనసాగుతుందన్నారు. ఆయా సేవా టికెట్లను ఆన్‌లైన్ ద్వారా పొందిన భక్తులు ప్రింట్ కాపీ, ఆధార్‌కార్డులను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు. అలాగే సర్పదోష నివారణ పూజ, అక్షరాభ్యాసం, అన్నప్రాసన టిక్కెట్లు కరెంట్‌బుకింగ్ ద్వారా కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సామాన్య భక్తులు ఇబ్బందులు ఎదుర్కొకుండా అన్ని ఆర్జిత సేవలు, స్పర్శదర్శనం నిర్దిష్ట వేళల్లోనే నిర్వహిస్తామని తెలిపారు. ఆలయానికి వచ్చే ప్రముఖులు, కనీసం రెండు రోజులు ముందుగా వారి పర్యటన వివరాలను తెలియజేయాల్సి ఉంటుందని అన్నారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ మార్పులు చేసినట్లు ఈఓ లవన్న పేర్కొన్నారు.

మారాము లేక.. మదినిండా దిగులు

- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- కనిపించని ఏడు నెలల బాలుడు
- కొనసాగుతున్న రైల్వే పోలీసుల గాలింపు చర్యలు



అదృశ్యమైన చిన్నారి రాము

మంత్రాలయం: వారిది ఊరుగాని ఊరు. ఉసూరుమనిపించే బతుకు. దారిద్ర్యంలో నలుగుతున్న దీనావస్థ. భిక్షమెత్తితేనే నోట్లోకి నాలుగేళ్లు. శవాలు మోస్తేనే మెతుకులు. ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుని బతుకీడ్చే జీవితాలు. చెట్ల కింద కాలం వెళ్లదీసే కడుదయనీయ దుస్థితి. వీరికున్న ఒకే ఒక సంతోషం కుమారుడు. మారాం చేసే ఏడు నెలల మగబిడ్డ అదృశ్యం కావడంతో వారు దిక్కులు చూస్తున్నారు. 'ఏ ఒక్కరికీ మేం హానీ చేయలే.. అడుక్కుని తిని బతుకున్నాం.. మా రాము కనిపిస్తే చెప్పండయ్యా' అంటూ కనిపించిన వారినందరినీ అడుగుతూ కన్నీటి పర్యంతమవుతున్నారు.



దిగాలుగా కూర్చున్న తల్లిదండ్రులు

సీసీ ఫుటేజీలో ఇద్దరు అనుమానితులు

గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన వడ్డె ఆంజనేయులు, అంకమ్మ పదేళ్ల క్రితం బతుకు తెరువు కోసం మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామానికి వచ్చారు. వీరికి యల్లక్క (5), కనకమ్మ(3), రాము(7 నెలలు) సంతానం. స్థానిక పాత రైల్వేస్టేషన్‌లోని శౌచాలయం (మాత్రశాల)లో తలదాచుకుంటుకున్నారు. రైల్వే స్టేషన్ పరిధిలో ప్రమాదాల బారిన పడిన శవాలను మోస్తూ వడ్డె ఆంజనేయులు పోలీసులకు ఆసరాగా ఉంటూ వస్తున్నాడు. రైలు పట్టాలపై శవాలను తీయడం, అంతిమ సంస్కారాలు చేయడం చేస్తాడు. ఆయన భార్య అంకమ్మ చిన్నారులతో భిక్షాటన చేయడం, ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుని పిల్లలను పోషిస్తోంది. ఇటీవల ఆలూరు నియోజకవర్గం గూళ్యం జాతరకు పోయి వచ్చారు. తలదాచుకునే శౌచాలయాన్ని కూల్చివేయడంతో ఆ కుటుంబ సభ్యులు రైల్వే పట్టాలను ఆనుకుని ఉన్న చెట్టుకిందకు చేరారు. చెట్టుకిందనే బతుకు సాగిస్తూ వస్తున్నారు. శుక్రవారం రాత్రి వాన కురవడంతో శిథిలమైన పాత రైల్వేస్టేషన్ ముఖద్వారంలోకి వెళ్లారు. అప్పటికే అక్కడ ఇద్దరు వ్యక్తులు కునుకు తీస్తున్నారు. పిల్లాపాపలు నిద్రలోకి జారుకోవడంతో ఇరువురు తలవాల్చారు. వేకువ జామున 4.30 గంటల ప్రాంతంలో లేచిచూడగా బాలుడు రాము కనిపించలేదు. ఆ పక్కనే నిద్రిస్తున్న వ్యక్తులు కూడా అక్కడ లేకపోయారు. దీంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తూ తుంగభద్ర గ్రామంలోకి వచ్చారు. పిల్లాడి కోసం ఆరా తీస్తుండగా ఓ హోటల్ నడిపే వ్యక్తి చిన్నారి ఏడుపులు వినిపించాయని, ఇద్దరు బైకుపై ఉన్నారని పేర్కొన్నాడు. రైల్వే పోలీసులు ఇదే కోణంలో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో గ్రామంలో ఇద్దరు వ్యక్తులు సంచరిస్తూ కనిపించారు. ఇదే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఏడని వెతికేమని, ఎవరని వేడేమని వీధిన పడి తల్లిదండ్రులు పడే యాతన వర్ణనాతీతం. వారి ఆవేదన చూసి అయ్యోపాపం అంటూ పదువురి హృదయాలు సైతం ద్రవిస్తున్నాయి.

మంత్రాలయంలో భక్తుల రద్దీ



మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి వేలాదిగా తరలివచ్చారు. వేకువజాము నుంచే రాఘవేంద్రస్వామి దర్శనార్థం వరుస కట్టారు. మూల బృందావన దర్శనానికి గంటకుపైగా సమయం పట్టింది. భక్తుల రాకతో మంత్రాలయంలోని పురవీధులు కిక్కిరిశాయి. పరిమళ ప్రసాదం, అన్నపూర్ణ భోజనశాల క్యూలైన్లు రద్దీగా దర్శనమిచ్చాయి. వ్యాపార దుకాణాలు సైతం కళకళలాడాయి.

కుంభాభిషేక ఏర్పాట్ల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మహాకుంభాభిషేక మహోత్సవ ఏర్పాట్లను శ్రీశైల దేవస్థాన కార్యనిర్వాహణాధికారి లవన్న ఆదివారం పరిశీలించారు. శిఖరేశ్వర ఆలయ మెట్ల మార్గంలో మరమ్మతులు, శిఖరేశ్వరం ఆలయ కటాంజనాలకు పెయింటింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు. శిఖరేశ్వరం పుష్కరిణిని శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫాలధార, పంచధార ప్రవేశద్వార సమీపంలో ఆదిశంకరాచార్యులు విగ్రహవేదికను మరింత విస్తరింపజేయాలని ఆదేశించారు. వేదికకు గ్రానైట్‌బండపరుపును వేయాలని సూచించారు.

డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహం

కర్నూలు(అగ్రికల్చర్): చేపల వ్యాపారంలో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామలమ్మ తెలిపారు. ఆదివారం కర్నూలు నగరంలో ఫిష్ ఆంధ్ర కింద ఏర్పాటు చేసిన రీటైల్ వెండింగ్ యూనిట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏడాది క్రితంతో పోలిస్తే చేపల వినియోగం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. రీటైల్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు ద్వారా నిరుద్యోగ యువత ఉపాధి పొందుతుందని పేర్కొన్నారు. వెంకటరమణ కాలనీలో ఫిష్ ఆంధ్ర కింద రీటైల్ అవుట్‌లెట్‌ను నిర్వహిస్తున్న మహిళకు పేటీయం మిషన్‌ను అందచేశారు. ఇప్పటి వరకు 15 మందికి పేటీయం మిషన్‌లను ఉచితంగా పంపిణీ చేసినట్లు వివరించారు.



పేటీయం మిషన్‌ను అందచేస్తున్న శ్యామలమ్మ



మట్టి మనుషుల జీవన నాదం

నెత్తిపై తట్ట.. భుజాన సలికతో వడివడిగా అడుగులు వేస్తున్న వీరంతా 'ఉపాధి' కూలీలు.. కష్టాన్నే నమ్ముకున్న శ్రమజీవులు.. కల్మషమెరుగని గ్రామీణులు.. కటిక నేలకు సైతం కరుణను నేర్పించి, సస్యాలు పండించేలా చేసే ప్రావీణ్యం వీరిది. అడ్డదిడ్డంగా ప్రవహించే జలాలకు దిశను చూపించి, జీవన నాదం వినిపించే నైపుణ్యం వీరి సొంతం. ఆదివారం ఉదయం కోడుమూరు మండలం గోరంట్ల గ్రామ సమీపంలో పనులు చేసేందుకు దండుగా వెళ్తూ ఇలా కన్పించారు.

– కోడుమూరు

క్లుప్తంగా

మల్లన్నను దర్శించుకున్న టీవీ నటి


నటి రూప

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను బుల్లితెర నటి రూప ఆదివారం దర్శించుకున్నారు. వీరు స్వామిఅమ్మవార్ల దర్శన అనంతరం స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించుకున్నారు. కాగా రూప ప్రస్తుతం జీ తెలుగులో ప్రసారం అయ్యే కృష్ణతులసి, కల్యాణం కమనీయం సీరియళ్లలో నటిస్తున్నారు. పలువురు అభిమానులు ఆమెను గుర్తించి సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు.

మహిళ ఆత్మహత్య

తుగ్గలి: మండల పరిధిలోని రామలింగాయపల్లిలో ఆదివారం ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన వడ్డే వినీల అలియాస్ గీతాంజలి(30)కి డోన్ మండలం ఎద్దుపెంటకు చెందిన ఆంజినేయులుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. రెండు రోజుల క్రితం పుట్టినిల్లు రామలింగాయపల్లికి వచ్చింది. తల్లి పుల్లమ్మ పని నిమిత్తం పత్తికొండకు వెళ్లిన సమయంలో వినీల ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న జొన్నగిరి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పత్తికొండకు తరలించామని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రామాంజినేయులు తెలిపారు.


వ్యక్తి అదృశ్యం

కోవెలకుంట్ల: కలుగొట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు రేవనూరు ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. ఆదివారం ఎస్ఐ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తికి మూడేళ్ల క్రితం ఆత్మకూరుకు చెందిన మమత అనే మహిళతో వివాహమైంది. ఇటీవల భార్యను పుట్టింటి వద్ద వదలిపెట్టి వచ్చాడు. భార్యను ఇంటికి పిలుచుకుని వస్తానని శనివారం మధ్యాహ్నం బయలుదేరి వెళ్లాడు. భార్య ఇంటికి వెళ్లకపోగా తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్దకు వెళ్లి ఉండవచ్చని ఆరా తీశారు. ఆచూకీ తెలియకపోవడంతో సుబ్బారెడ్డి భార్య పోలీసులను ఆశ్రయించింది.ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వాటర్‌షెడ్ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు వాటర్‌షెడ్ కార్యాక్రమాలు, సహజ వనరుల వినియోగంపై సమగ్రంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా నీటియాజమాన్య సంస్థ అసిస్టెంటు ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. ఆదివారం దేశీ డిప్లొమా కార్యక్రమం కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దేశీ కార్యక్రమం సమన్వయ కర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య పాల్గొన్నారు.

సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మోహన్‌రెడ్డి



తుగ్గలి : వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తుగ్గలి మాదిరెడ్డి మోహన్‌రెడ్డి నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు. పార్టీని మరింత పటిష్టం చేయడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

కష్టం..సౌఖ్యం.. కార్మిక శక్తికి వందనం


చెత్తను తొలగిస్తూ..


వామును శుభ్రపరుస్తూ..


ఉల్లిగడ్డల బస్తా మోస్తూ..

మనం నడుస్తున్న వీధి శుభ్రంగా ఉండాలి.. మన ఇంటి పక్కన కాలువలో చెత్తాచెదారం ఉండకూడదు.. భారీగా బరువులు మోయకుండానే మన గృహ నిర్మాణం పూర్తి కావాలి.. వండే ఆహార పదార్థాల్లో మలినాలు ఉండకూడదు.. ఇవే కాదు ఇంకా ఎన్నెన్నో.. కార్మికుల కష్టంతో మన కోరికలు నెరవేరి, జీవనం సాఫీగా సాగుతోంది. జాతికి వెలుగు అందుతోంది. జగానికంతా సౌఖ్యం నిండుతోంది. విరామమెరుగక పరిశ్రమించే కార్మికుల దినోత్సవం ఈ రోజే. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ కార్మికులకు సలాం చేయాల్సిందే.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


బండి నుంచి ఇసుకను అన్‌లోడ్ చేస్తూ..


మిర్చిని బస్తాల్లోకి కూర్చుతూ..

మామిడి కోతలో జాగ్రత్తలు

- బ్రిక్స్ రీడింగ్ ద్వారా కాయలు కోయవచ్చు
- ఐఐహెచ్ఆర్ రూపొందించిన దోటిని ఉపయోగించాలి
- కాయలపై సొన కారకుండా చూడాలి
- ఉద్యానశాఖ శాఖ టెక్నికల్ అధికారి మహబూబ్‌బాషా సూచనలు



కర్నూలు(అగ్రికల్చర్): మామిడికి ఉమ్మడి కర్నూలు జిల్లా పెట్టంది పేరు. జాతీయ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన బంగినపల్లి(బేనిషాన్) రకాన్ని ఈ జిల్లాలోనే పండిస్తుండటం విశేషం. ఈ రకాన్నే విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. మామిడికాయలు ఇప్పుడిప్పుడే పక్వానికి వస్తున్నాయి. కోతలు కూడా మొదలవుతున్నాయి. మామిడి కోతల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను ఉద్యానశాఖ టెక్నికల్ అధికారి మహబూబ్‌బాషా వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఉదయం వేళల్లో కోత ఉండాలి

బాగా ముదిరిన లేత ఆకుపచ్చ రంగు కల్గిన కాయలనే కోయాలి. బ్రిక్స్ మీటర్ ద్వారా బ్రిక్స్ 10–13 ఉన్న కాయలను కోసుకోవాలి. ఇవి రవాణాకు అనుకూలంగా ఉంటాయి. లోపల కండ లేత పసుపు రంగులో ఉండాలి. కోత ఉదయం 10 గంటల లోపు లేదంటే సాయంత్రం వేళల్లోనే ఉండాలి. కోత కోయడానికి ఐఐహెచ్ఆర్ వారు రూపొందించిన దోటిని ఉపయోగించాలి. కాయలకు 6 నుంచి 7 సెంటీమీటర్ల తొడమ ఉండేటట్లు చూసుకోవాలి. కాయలపైన సొన కారకుండా చూడాలి. సొన పూర్తిగా కారిన తర్వాత తొడిమలను 1 నుంచి 0.5 సెంటీమీటర్ వరకు కత్తిరించాలి.

ఇథిలిన్‌తో మాగించాలి

మామిడికాయలను వ్యాపారులు కార్బైడ్ అనే కెమికల్స్‌ను ఉపయోగించి కృత్రిమంగా మాగిస్తున్నారు. దీని వల్ల కాయ మంచి రంగు వచ్చి రుచి ఉండదు. పైగా అనారోగ్యానికి కారణమవుతోంది. రైతులు, వ్యాపారులు కార్బైడ్‌తో మాగించడానికి స్వస్తి పలికి ఆరోగ్యవంతమైన పద్ధతుల ద్వారా మాగించాలి. అప్పుడే రుచి, శుచి లభిస్తాయి. ఈ రెండు ఉంటే మంచి ధర లభిస్తుంది. ఇథిలిన్‌తో మామిడిని మాగించడం అన్ని విధాలా మంచిది. ఇథిలిన్ అనేది గ్రోత్ హార్మోన్, ఇది అన్ని చోట్ల లభ్యమవుతుంది. 10 లీటర్ల నీటికి ఒక ఎంఎల్ ఇథిలిన్ కలిపిన ద్రావణంలో మామిడి కాయలను ముంచి నీడలో ఆరబెట్టిన తర్వాత గదిలో మామిడిని పోసి వరిగడ్డి కప్పితే 24 గంటల్లోనే మంచి రంగు, సువాసన వస్తుంది. ఇలా మామిడిని మాగించడం అన్ని విధాలా ఆరోగ్యదాయకం.

శుభ్రపరచడం చాలా అవసరం

కాయలను శుభ్రపరచడం చాలా అవసరం. 10 గ్రాముల డిటర్జంట్ 10 లీటర్ల నీటికి కలిపిన ద్రావణంలో కడగాలి. తర్వాత వాటిని మంచినీటితో కడగాలి. తర్వాత 52 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత గల వేడినీటిలో 200 పీపీఎం సోడియం హైపోక్లోరైడ్ కలిపి 2 నుంచి 3 నిమిషాల పాటు ఉంచాలి. కాయలపై ఉన్న తేమ ఆరే వరకు నీడలో ఆరబెట్టాలి. 300–350 గ్రాముల బరువు ఉండేటట్లు గ్రేడింగ్ చేసుకుని.. అట్టపెట్టెలలో 10 నుంచి 13 కాయలు అమర్చి ప్యాకింగ్ చేసుకోవాలి. అట్ట పెట్టెలపై ఆకర్షణీయమైన మామిడి బొమ్మలను, అవసరమైన సమాచారాన్ని పొందుపరచాలి.

4న అరుణాచలానికి ఇంద్ర ఏసీ బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): గిరి ప్రదక్షిణ దీపోత్సవం సందర్భంగా తమిళనాడులోని అరుణాచల క్షేత్రం దర్శనం కోసం మే 4వ తేదీన ఇంద్ర ఏసీ ప్రత్యేక బస్సు (సర్వీస్ నంబర్–93998)ను నడపనున్నట్లు కర్నూలు–2డిపో అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు గురువారం రాత్రి 8గంటలకు కర్నూలు నుంచి ఈ బస్సు బయలుదేరి, మరుసటి రోజు శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం, దీపోత్సవం అనంతరం అదే రోజు సాయంత్రం 4గంటలకు బస్సు బయలుదేరి, శనివారం ఉదయం 6గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని వెల్లడించారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రభుత్వ కాలేజీ విద్యార్థి ప్రతిభ

- 98.84 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా లెవెల్‌లో 13,509వ ర్యాంకు


ఎల్.చరణ్ కార్తీక్

కర్నూలు సిటీ: ప్రభుత్వ జూనియర్(టౌన్‌మోడల్)కాలేజీలో ఇంటర్మీడియెట్ చదివిన ఓ విద్యార్థి ఇటీవల నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించిన జేఈఈ పరీక్షల ఫలితాల్లో కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఉత్తమ పర్సంటైల్ సాధించారు. నగరంలోని ఏక్యాంపు ఉన్న ఎల్.సుధాకర్ బాబు, ఎల్.వరలక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమారులు. సుధాకర్ బాబు బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈయన పెద్ద కుమారుడు లక్ష్మీపురం చరణ్ కార్తీక్ పాఠశాల విద్య ఏక్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో చదివారు. ఇంటర్మీడియెట్ మాత్రం ప్రభుత్వ కాలేజీలో చదివి 961 మార్కులు సాధించారు. జేఈఈలో 98.84 పర్సంటైల్ సాధించి ఆల్ ఇండియా లెవెల్‌లో 13,509వ ర్యాంకు, ఎస్టీ క్యాటగిరీలో 74వ ర్యాంకు సాధించారు. ఢిల్లీ, ఖరగ్‌పూర్ ఐఐటీల్లో రొబొటిక్స్‌లో ఇంజినీరింగ్ చదివిన తరువాత సివిల్స్ పరీక్షలు రాసి ఉన్నతస్థాయి ఉద్యోగం సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చరణ్‌కార్తీక్ తెలిపారు.

వ్యక్తిపై సీసాతో దాడి

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ఆదివారం చెత్త విషయంలో ఘర్షణ పడి ఓ వ్యక్తిపై గాజు సీసాతో దాడి చేశాడు. అవుట్‌పోస్టు పోలీసుల సమాచారం మేరకు.. సాయిబాబానగర్‌లో భవన నిర్మాణ కార్మికులు అల్తాఫ్, ఫయాజ్ ఎదురెదురుగా నివాసముంటున్నారు. వీరు ఇంటి ముందు మురుగునీటి కాల్వలో చెత్త విషయంలో ఘర్షణ పడ్డారు. ఫయాజ్ ఆగ్రహంతో అల్తాఫ్‌ను గాజు సీసాతో కడుపులో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబీకులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫాస్టాక్ లైసెన్సు తప్పనిసరి

కర్నూలు (టౌన్): వ్యాపారులు ఫాస్టాక్ లైసెన్సును తప్పనిసరిగా తీసుకోవాలని కర్నూలు, నంద్యాల ఫుడ్ ఆఫీసర్ శేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు కొత్తబస్టాండ్ సమీపంలోని ఒక హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కాయ్ వంజీ బాబా గ్రామీణ వికాస్ మండల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫుడ్ ఆఫీసర్ మాట్లాడుతూ.. వ్యాపారులు ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలన్నారు. ఫాస్టాక్ కేవీజీవీఎం పాన్ ఇండియా శిక్షకులు సింధూజోస్ పాల్గొన్నారు.

వైద్య విజ్ఞాన సదస్సులతో జ్ఞాన సముపార్జన


పల్మనాలజీ సీఎంఈలో పాల్గొన్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): వైద్య విజ్ఞాన సదస్సుల్లో పాల్గొనడం వల్ల వైద్య విద్యార్థులకు జ్ఞానసముపార్జన లభిస్తుందని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ చెప్పారు. ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలో పల్మనాలజి, ఆర్థోపెడిక్ విభాగాలు జోనల్–3 నిరంతర వైద్య విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు ప్రతి విభాగం తప్పనిసరిగా సీఎంఈలు నిర్వహించాలని చెప్పారు. దీనివల్ల ప్రపంచంలో ఎప్పటికప్పుడు వైద్యరంగంలో వస్తున్న మార్పులను తెలుసుకుని, జ్ఞాన సముపార్జన చేసుకోవచ్చన్నారు. టీబీసీడీ విభాగంలో జరిగిన పల్మనాలజి సీఎంఈలో పలు అంశాలపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అంబరీనాథ్, డాక్టర్ సరిత శామ్యూల్, డాక్టర్ పి. శ్వేత, డాక్టర్ ఎం. సరిత, డాక్టర్ ఫ్రాంక్ మోహన్(నంద్యాల), ప్రొఫెసర్ డాక్టర్ ఏఎస్. శ్రీకాంత్(విజయవాడ), కళాశాలలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో నిర్వహించిన ఆర్థోపెడిక్ సీఎంఈలో పలు అంశాలపై ప్రొఫెసర్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, డాక్టర్ రమణ, డాక్టర్ పి. సుజిత్ దేవప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏఎం. ఇలియాస్ బాషా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాణి, రేడియాలజి ప్రొఫెసర్ డాక్టర్ సురేష్, సర్జికల్ అంకాలజిస్టు డాక్టర్ రవీంద్ర బాబు ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, టీబీసీడీ హెచ్‌వోడి డాక్టర్ వెంకటరావు, ఆర్థోపెడిక్ హెచ్‌వోడి డాక్టర్ శ్రీనివాసులు, వైద్యులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టుల అసోసియేషన్ అడహక్ కమిటీ ఎన్నిక


నూతన అడహక్ కమిటీ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ ఫార్మాసిస్టు అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహరి, ప్రకాశం జిల్లా అధ్యక్షులు పి. శ్రీనివాసరావు సమక్షంలో సభ్యత్వాలు స్వీకరించారు. అనంతరం అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా కె. రంగస్వామి(ప్రాతకోట), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎ. బాషావలి(దేవనకొండ), ఉపాధ్యక్షులుగా బి. రేఖ(కొత్తబురుజు), ఎ. జనార్దనుడు(జీజీహెచ్, కర్నూలు), పి. నాగరాజు(బదినేహాల్), పి. రామకృష్ణయ్య(ద్వైవందిన్నె), జనరల్ సెక్రటరీగా ఎం. రాజేష్ నాయక్(తిమ్మాపురం), జాయింట్ సెక్రటరీలుగా కె. సురేంద్రబాబు(పుచ్చకాయలమడ), ఎం. షేక్ నూర్‌బాషా(షరీన్‌నగర్), బి. పార్వతి(జూపాడుబంగ్లా), వి. లక్ష్మీనారాయణ (సి.బెళగల్), పి. చంద్రశేఖర్(నారాయణపురం) ఎన్నికయ్యారు.

అశోకా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినుల ప్రతిభ


జాబ్ ఆఫర్స్ సాధించిన విద్యార్థినులు

కల్లూరు: దూపాడు సమీపంలో ఉన్న అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చూపినట్లు కళాశాల చైర్మన్ కె.అశోక్ వర్ధన్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు 847 జాబ్ ఆఫర్స్ లభించిన సందర్భంగా ఆదివారం ట్రయంఫ్–2023 (ప్లేస్మెంట్ సక్సెస్ మీట్) నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఫసిస్ కంపెనీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ఆలిండియా హెచ్ఆర్ శోభనా కార్తీక్ హాజరయ్యారు. కళాశాలకు చెందిన బి.యువరాణి 10 జాబ్ ఆఫర్స్ సాధించిందని,7 జాబ్ ఆఫర్స్‌ను ఆరుగురు విద్యార్థినులు, 5 జాబ్ ఆఫర్స్‌ను 30 మంది విద్యార్థినులు సాధించారని కళాశాల చైర్మన్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణం తీసిన అతివేగం


ప్రమాదంలో రెండు ముక్కలైన బైక్


మృతి చెందిన వినయ్‌కుమార్

కృష్ణగిరి: అతివేగానికి ఓ నిండు ప్రాణం బలైంది. అమకతాడు టోల్‌గేట్ సమీపాన జాతీయ రహదారిలో ఆదివారం సాయంత్రం అదుపుతప్పి బైక్ బోల్తా పడిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వినయ్‌కుమార్(27) మృతి చెందాడు. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట్‌కు చెందిన శ్రీనివాసులు కుమారుడు వినయ్‌కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు బైక్‌పై వస్తున్నాడు. అతివేగం, అజాగ్రత్తగా వస్తూ అమకతాడు టోల్‌గేట్‌కు అర కిలోమీటర్ దూరంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడి రెండు ముక్కలైంది. దీంతో రహదారి పక్కనున్న రాళ్లకు వినయ్‌కుమార్ బలంగా కొట్టుకున్నారు. గమనించిన వారు హైవే పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వెంటనే అక్కడికి చేరుకుని బాధితునికి సీపీఆర్ చేసి వెంటనే 108 అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. పర్సులో ఉన్న కార్డుల ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందజేశామని ఎస్ఐ తెలిపారు.

కాటేసిన కరెంట్ తీగలు

- వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి



మృతి చెందిన చైతన్య, కోటపాడు లక్ష్మయ్య

ఆలూరు రూరల్/పాణ్యం: ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేర్వేరు చోట్ల కరెంట్ తీగలు ఇద్దరి ప్రాణాలను బలిగొన్నాయి. హాలహర్వి మండలం కామినేహాల్ గ్రామంలో శనివారం రాత్రి గాలీవానకు చైతన్య కుమార్ (33) ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన సర్వీసు వైరుకు ఉన్న జీఐ వైర్ తెగిపోయింది. ఆదివారం ఉదయం దీన్ని సరిచేస్తూ చైతన్య కుమార్ విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలి మృతిచెందాడు. మృతుడికి భార్య తేజస్విని ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఆలమూరులో..

పాణ్యం మండల పరిధిలోని ఆలమూరు గ్రామానికి చెందిన కోటపాడు లక్ష్మయ్య(23) ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తాటికాయలను తెంపేందుకు చెట్టు ఎక్కగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురై కిందపడి మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.



వికసించిన మే పుష్పం

సరిగ్గా మే నెల ప్రారంభానికి కొన్ని ఘడియల ముందే కర్నూలు నగరం సీక్యాంప్ సెంటర్‌లోని మాజీ కార్పొరేటర్ సురేంద్ర ఇంట్లో మే పుష్పం వికసించింది. లిల్లీ జాతికి చెందిన ఈ మొక్క మే నెలలో పుష్పిస్తుంది. మిగతా కాలం అంతా ఆకులతో కనిపిస్తుంది. మొగ్గ పువ్వుగా విచ్చుకోవడానికి సుమారు ఇరవై రోజుల సమయం పడుతుంది. – సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు